క్లుప్తంగా

పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి



ఆకుకూరల ప్రాముఖ్యతను వివరిస్తున్న సీడీపీఓ

మార్కాపురం టౌన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారం అందించడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు సీడీపీఓ సుశీలాదేవి పేర్కొన్నారు. మార్కాపురం పట్టణంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార వారోత్సవాలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పౌష్టికాహారంతో ఉపయోగాలు, తయారీ విధానాన్ని గర్భిణులు, తల్లులకు వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రమాదేవి, కార్యకర్తలు జబీనా, సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ ఆఫీసా.. పార్కింగ్ ప్లేసా?



మార్కాపురం రెవెన్యూ కార్యాలయ ఆవరణలో పార్కింగ్ చేసి ఉన్న కార్లు

మార్కాపురం రూరల్: మార్కాపురం తహసీల్దార్ కార్యాలయం వాహనాల పార్కింగ్ ప్లేస్‌లా మారింది. వివిధ ప్రాంతాలకు వెళ్లే వారు తమ వాహనాలకు పార్కింగ్ ప్లేసుగా మార్కాపురం తహసీల్దార్ కార్యాలయాన్ని ఎంచుకున్నారు. తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో ట్రెజరీ ఆఫీసు, సబ్‌జైలు, ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్, ఎంప్లాయిమెంట్ కార్యాలయం ఉన్నాయి. దీంతో కార్యాలయానికి వచ్చే అర్జీదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఇక ఎంపీడీఓ కార్యాలయం టూవీలర్స్‌కు పార్కింగ్ ప్లేసుగా మారింది. ఒంగోలు, విజయవాడ వెళ్లేవారు ఉదయాన్నే తమ టూవీలర్‌ను ఎంపీడీఓ కార్యాలయాల్లో పార్కింగ్ చేసి వెళ్తున్నారు. అధికారులు వీటిపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

ఈ-క్రాప్‌తో రైతులకు మేలు



వద్దిమడుగులో పంట నమోదును పరిశీలిస్తున్న ఏఓ

కొనకనమిట్ల: మండలంలోని వద్దిమడుగు రైతు సేవా కేంద్రం పరిధిలో ఈ క్రాప్ నమోదు ప్రక్రియను మంగళవారం రైతులు, వ్యవసాయ సహాయకులతో కలిసి ఏఓ ప్రసన్న రంగలక్ష్మి పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ.. పంట నష్ట పరిహారం, సబ్సిడీలు పొందేందుకు ఈ క్రాప్ వివరాలే ప్రామాణికమని పేర్కొన్నారు. ఈనెల 15వ తేదీలోగా రైతులు తాము సాగు చేసిన పంటల వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

కేజీబీవీలో పోషకాహార సదస్సు

తర్లుపాడు: మండలంలోని కలుజువ్వలపాడు కేజీబీవీలో మంగళవారం ఐసీడీఎస్ సీడీపీఓ సుశీలాదేవి ఆధ్వర్యంలో పౌష్టికాహార సదస్సు నిర్వహించారు. ఆకుకూరలు, తృణ ధాన్యాలు తీసుకోవాలని విద్యార్థినులకు సూచించారు. బాల్య వివాహాలతో అనర్థాలపై ప్రిన్సిపాల్ మారుతీదేవి అవగాహన కల్పించారు. తర్లుపాడు పీహెచ్‌సీ సిబ్బంది వైద్య పరీక్షలు చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణవేణితోపాటు కేజీబీవీ సిబ్బంది పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో పీహెచ్‌సీ డాక్టర్ల నిరసన



బేస్తవారిపేట పీహెచ్‌సీలో నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరైన డాక్టర్లు

బేస్తవారిపేట: మండలంలోని పీహెచ్‌సీ వైద్యాధికారులు జీఓ 85కి వ్యతిరేకంగా నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. కొత్త జీఓ ప్రకారం మూడేళ్ల సర్వీసు అర్థం లేకుండా పోతుందని, ఆకస్మాత్తుగా జీఓను మార్చడం అన్యాయమని, తమ వృత్తి ప్రగతికి తీవ్ర నష్టం జరుగుతుందని డాక్టర్లు పేర్కొన్నారు. అన్యాయమైన ఈ జీఓను రద్దు చేయాలని ఉన్నత స్థాయి అధికారులు, ఎమ్మెల్యేలకు అర్జీలు ఇచ్చినప్పటికి ఎటువంటి స్పందన లేకపోవడంతో ఆందోళన బాట పట్టినట్లు తెలిపారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

మార్కాపురం: మార్కాపురం పట్టణ శివారులో పేకాట శిబిరంపై పోలీసులు మంగళవారం దాడి చేశారు. ఐదుగురు జూదరును అదుపులోకి తీసుకుని, 4 బైకులు, 4 సెల్ ఫోన్లు, 2500 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ ఎస్సై సైదుబాబు చెప్పారు. నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు.

జై దేవ శ్రీ గణేశా..



రాణిపేటలో ప్రత్యేక అలంకరణలో వినాయకుడు



రాచర్ల బీసీ కాలనీలో భారీ వినాయక విగ్రహం



దరిమడుగులో గణేశుడికి పూజలు చేస్తున్న చిన్నారులు

- నిమజ్జనానికి తరలిన వినాయక విగ్రహాలు
- భక్తుల కోలాహలం మధ్య ప్రతిమల ఊరేగింపు

బేస్తవారిపేట: గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పూజలందుకున్న లంబోదరుడి విగ్రహాలు భక్తుల కోలాహలం నడుమ నిమజ్జనానికి తరలివెళ్తున్నాయి. నాలుగో రోజు మంగళవారం బేస్తవారిపేట, పూసలపాడు తదితర గ్రామాల్లోని వినాయక విగ్రహాలను ట్రాక్టర్లపై ఊరేగింపుగా కంభం చెరువు తరలించి నిమజ్జనం చేశారు. బేస్తవారిపేటలోని రాణిపేటలో సిద్ధి బుద్ధి వినాయక వివాహ మహోత్సవం నిర్వహించారు. పాపాయిపల్లెలో కుంకుమ పూజలు చేశారు. అక్కపల్లెలో గణేశ్ విగ్రహం వద్ద ఉంచిన లడ్డూ వేలం వేయగా రూ.51 వేలకు కొండా వీరారెడ్డి దక్కించుకున్నారు. బేస్తవారిపేట రెడ్డినగర్‌లో విగ్రహం వద్ద లడ్డూను రూ.35 వేలకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ ఏడుకొండలు సొంతం చేసుకున్నారు.

కొనకనమిట్ల: కొనకనమిట్ల ఎస్సీ కాలనీ, చినారికట్ల శివాలయం వీధిలో గణనాథుడి విగ్రహాలు నిమజ్జనానికి తరలివెళ్లాయి. ఉట్టి కొట్టే కార్యక్రమంలో యువకులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ప్రజలందరికీ శుభాలు కలగాలి

మార్కాపురం: ప్రజలందరికీ మంచి జరగాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి ఆకాంక్షించారు. మార్కాపురంలోని రథం బజారులో గణేశ్ మండపం వద్ద మంగళవారం ఆయన పూజలు నిర్వహించారు. ఆయన వెంట వాల్మీకి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ నల్ల బోతుల కొండయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు చదలవాడ రమణారెడ్డి, శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి దేవస్థానం చైర్మన్ కేశవరావు, సాంబశివారెడ్డి తదితరులు ఉన్నారు. మండలంలోని వేములకోట, దరిమడుగు తదితర గ్రామాల్లో గణేశ్ నవరాత్రులు వైభవంగా సాగుతున్నాయి. సోమవారం రాత్రి వేములకోటలో గణనాథుడి విగ్రహాన్ని భక్తుల కోలాహలం మధ్య నిమజ్జనం చేశారు. దరిమడుగులో మంగళవారం చిన్నారులందరూ వినాయక పూజల్లో ప్రత్యేకంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు.

రాచర్ల: మండలంలోని అనుమలవీడు, ఆకవీడు, రాచర్ల, గంగంపల్లె, యడవల్లి గ్రామాల్లో గణనాథుడికి భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. అనుమలవీడు గ్రామంలో చిన్నారులకు ఆటలపోటీలు, కోలాటం తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మంగళవారం రాత్రి అనుమలవీడు, రాచర్ల బీసీ కాలనీల్లో అన్నసంతర్పణ చేశారు.



చినారికట్లలో..



కొనకనమిట్ల హరిజన కాలనీలో..



బేస్తవారిపేట : నిమజ్జనానికి తరలుతున్న గణపతి విగ్రహాలు



మార్కాపురం : పూజల్లో పాల్గొన్న జంకె వెంకటరెడ్డి

ప్రభుత్వ వైఫల్యంతోనే విలయవాడ

- వరద వస్తుందని 20 గంటల ముందే ప్రభుత్వ పెద్దలకు తెలుసు
- అయినా ప్రజలను అప్రమత్తం చేయకపోవడం దారుణం
- ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నా నష్టం భారీగా తగ్గేది
- మాజీ ఎమ్మెల్యే, గిద్దలూరు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కేపీ నాగార్జునరెడ్డి



మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

బేస్తవారిపేట: విజయవాడను వరద నీరు ముంచెత్తనుందని రాష్ట్ర ప్రభుత్వ పెద్దలకు 20 గంటల ముందుగానే సమాచారం ఉన్నప్పటికీ ప్రాణ నష్టం, ఆస్తి నష్టాన్ని నివారించడంలో పూర్తిగా విఫలమయ్యాని మాజీ ఎమ్మెల్యే, గిద్దలూరు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కేపీ నాగార్జునరెడ్డి విమర్శించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. బుడమేరుపై వెలగలేరు వద్ద ఉన్న రెగ్యులేటర్ 11 గేట్లనూ ఎత్తుతున్నట్లు ఇరిగేషన్ అధికారులు ముందుగానే సమాచారం ఇచ్చినా విజయవాడ ప్రజలను ఎందుకు అప్రమత్తం చేయలేదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నట్లయితే ఇలాంటి పరిస్థితి వచ్చేది కాదని, లక్షల కుటుంబాలు కట్టుబట్టలతో రోడ్డున పడకుండా ఉండేవన్నారు. ఆంధ్రప్రదేశ్‌తోపాటు ఎగువన ఉన్న తెలంగాణలో భారీగా వర్షం కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) అప్రమత్తం చేసినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఐఎండీ హెచ్చరికలను బేఖాతరు చేయడంతోపాటు ఇరిగేషన్ అధికారులు సమాచారం ఇచ్చినా ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేయడం వల్లే విజయవాడ వాసులు పీకల్లోతు వరద నీటిలో చిక్కుకుని అవస్థలు పడుతున్నారని ధ్వజమెత్తారు. ఇప్పటికి 10 రోజులైనా ఇంకా విజయవాడలోని కాలనీలు వరద ముంపులోనే ఉండటం బాధాకరమన్నారు. ఫ్లడ్ కుషన్(వరదల సమయంలో ప్రాజెక్టుల నుంచి నీటిని దిగువకు వదిలే విధానం) పాటించేలా చర్యలు తీసుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం కావడం వరదలకు మరో ముఖ్య కారణమని చెప్పారు. కృష్ణా కరకట్టపై ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసాన్ని, బుడమేరుపై ఉన్న రాధాకృష్ణ యాక్టివ్ పవర్ ప్లాంట్‌ను కాపాడుకోవడం కోసం వరద నీటిని విజయవాడ వైపు మళ్లించి సుమారు 57 మంది మరణానికి, వేల కోట్ల రూపాయల ఆస్తి నష్టానికి కారణమయ్యారని మండిపడ్డారు. వరదల్లో మరణించిన కుటుంబాల వారికి ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ప్రజలకు జరిగిన నష్టాన్ని భరించాలని, మృతుల కుటుంబాలకు పరిహారం అందించాలని కోరారు. భవిష్యత్తులో ఇటువంటి నష్టాలు జరగకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

కుల నిర్మూలనతోనే దేశాభివృద్ధి

- కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లప్ప



మాట్లాడుతున్న నల్లప్ప, పక్కన అంజయ్య తదితరులు

మార్కాపురం: కుల నిర్మూలనతోనే దేశం అభివృద్ధి చెందుతుందని, బీజేపీ పాలనలో రాజ్యాంగం పెను ప్రమాదంలో పడిందని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లప్ప పేర్కొన్నారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా శిక్షణా తరగతులు మంగళవారం ఎన్‌జీఓ హోమ్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నల్లప్ప మాట్లాడుతూ.. పాలకులు కులాన్ని ఓటు బ్యాంకుగా మార్చుకున్నారని అన్నారు. అంటరానితనానికి, అణచివేతకు, కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడే సంఘం కేవీపీఎస్ మాత్రమేనన్నారు. వర్గీకరణ అంశంపై అనుకూల, ప్రతికూల వాదనలు మాట్లాడేవారు ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు కల్పించాలని ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. కేవీపీఎస్ జిల్లా వ్యవస్థాపకుడు జాలా అంజయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో దళితులపై రోజురోజుకూ అత్యాచారాలు, దాడులు పెరిగిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని బలహీనపరిచి పూర్తిగా నీరుగారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చనిపోయినప్పుడు కూడా పూడ్చేందుకు స్థలం లేక వివక్షను ఎదుర్కోవడం బాధాకరమని అన్నారు. కార్యక్రమంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి రఘురామ్, సీఐటీయూ నాయకులు సోమయ్య, డీకేఎం రఫీ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బాల నాగయ్య, జేసురత్నం, రాజశేఖర్, విక్టర్, నరేష్, కత్తి యేబు తదితరులు పాల్గొన్నారు.

ఏపీజీబీలో నాణ్యమైన సేవలు



కంభంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఏపీజీబీ అధికారులు

కంభం: ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ద్వారా ఖాతాదారులకు నాణ్యమైన సేవలందుతున్నాయని బ్యాంక్ రీజినల్ మేనేజర్ రఘురామ్ పేర్కొన్నారు. ఏపీజీబీ సేవలపై అవగాహన కల్పిస్తూ మంగళవారం రాత్రి కంభం, అర్ధవీడు, బేస్తవారిపేట బ్రాంచ్‌ల సిబ్బందితో కలిసి కంభం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రగతి కుబేర్ ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకం ద్వారా అన్ని బ్యాంకుల కన్నా అత్యధిక వడ్డీ రేటు 8.30శాతం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఓ సీనియర్ మేనేజర్ భువనేశ్వర్ రావు, ఆర్ఓ మేనేజర్ టీవీ రామకృష్ణారావు, కంభం బ్రాంచ్ సీనియర్ మేనేజర్ డి.వేణుగోపాల్‌రావు, కంభం, అర్ధవీడు, బేస్తవారిపేట, గలిజేరుగుళ్ల శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

మానసిక స్థైర్యం పెంపొందించుకోవాలి



విద్యార్థులకు చైతన్యం కల్పిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

తర్లుపాడు: విద్యార్థులు మానసిక స్థైర్యం పెంపొందించుకోవాలని, సమస్యలొస్తే కుంగిపోవద్దని స్పందన ఈదా ఫౌండేషన్ ప్రతినిధులు సూచించారు. మంగళవారం స్పందన ఈదా ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆత్మహత్యల నివారణపై చైతన్య సదస్సు నిర్వహించారు. ఫౌండేషన్ రాష్ట్ర సభ్యుడు సజీవరాజు మాట్లాడుతూ.. ఆధునిక ధోరణులు, మానసిక స్థైర్యం, సానుకూల జీవనవిధానంపై చైతన్యం కలిగించారు. ఒత్తిడి నివారణకు విద్యార్థులు యోగా సాధన చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ జిల్లా ఉపాధ్యక్షులు రవిశేఖర్‌రెడ్డి, సీనియర్ ఉపాధ్యాయులు పీవీ ఆనంద్, బొప్పరాజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పొలాల్లో కొండచిలువ కలకలం



కొండచిలువ పట్టుకుంటున్న రెస్క్యూ టీం



కొమరోలు : కొండచిలువను పట్టుకుని గోతంలో బంధిస్తున్న బృందం

రాచర్ల: నువ్వు పంటపై పొలాల్లో కొండచిలువ కలకలం సృష్టించింది. ఈ ఘటన మండలంలోని అనుమలవీడు గ్రామంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. అనుమలవీడు గ్రామానికి చెందిన ఇరుగుల వెంకటేశ్వర్‌రెడ్డి తన పొలంలో నువ్వు పంటను సాగు చేశాడు. మంగళవారం ఉదయం నువ్వు పంటను కోత చేస్తున్న సమయంలో 12 అడుగుల కొండచిలువ కనిపించడంతో కూలీలు భయాందోళన గురై పరుగెత్తుకుంటూ పక్క పొలాల్లో వచ్చారు. కొండచిలువను చూసిన కొంతమంది రైతులు గిద్దలూరు ఫారెస్టు అధికారులకు సమాచారాన్ని అందించడంతో ఇద్దరు ఫారెస్టు రెస్క్యూ టీం సిబ్బంది వెంటనే అనుమలవీడు గ్రామానికి చేరుకొని పొలంలో ఉన్న 12 అడుగుల కొండచిలువను పట్టుకున్నారు. కొండచిలువను సోమిదేవిపల్లె గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో విడిచిపెడుతున్నట్లు తెలిపారు.

15 అడుగుల కొండచిలువ పట్టివేత

కొమరోలు: మండలంలోని పోసుపల్లెలో మినరల్ వాటర్ ప్లాంటు వద్ద 15 అడుగుల కొండచిలువను మంగళవారం స్థానికులు గుర్తించారు. వెంటనే అటవీశాఖ సిబ్బందికి సమాచారం అందించడంతో గుంతపల్లి, అల్లినగరం ఫారెస్టు బీట్ అధికారులు డి.లక్ష్మీనారాయణ, ఉమాదేవి సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. గిద్దలూరు స్నేక్ రెస్క్యూ టీమ్‌కు సమాచారం అందించడంతో వారు సంఘటన స్థలానికి చేరుకుని కొండచిలువను పట్టుకుని గోతంలో బంధించి రిజర్వు ఫారెస్టులో వదిలిపెట్టారు.

స్కిల్ హబ్ సెంటర్లతో ఉపాధి కల్పన



మాట్లాడుతున్న ఆర్ఐఓ సైమన్ విక్టర్

కంభం: నిరుద్యోగ సమస్యను గ్రామ స్థాయి నుంచే పరిష్కరించడానికి స్కిల్ హబ్ సెంటర్లు ఎంతగానో దోహదపడతాయని ఆర్ఐఓ సైమన్ విక్టర్ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం జాబ్ మేళా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్ఐఓ మాట్లాడుతూ.. స్కిల్ హబ్ సెంటర్ల ద్వారా వివిధ విభాగాల్లో శిక్షణ ఇవ్వడమే కాక జాబ్ మేళాలు నిర్వహించి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. యువత సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాలను పెంచుకోవడం ద్వారా త్వరితగతిన సులభంగా ఉపాధి పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. నాలుగు ప్రముఖ కంపెనీల ప్రతినిధులు జాబ్‌మేళాలో పాల్గొని అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 183 మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారు. డీఎస్‌డీఓ జె.రవితేజ, జిల్లా ఉపాధి అధికారి భరధ్వాజ, డీపీ అజయ్ కుమార్, జేసీఓ నాగరాజు, టీపీ సదన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన తిప్పయ్య



చికిత్స పొందుతున్న రంగరమేష్

బేస్తవారిపేట: రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలైన సంఘటన బేస్తవారిపేట మండలంలోని పెంచికలపాడు సమీపంలో ఒంగోలు-నంద్యాల హైవే రోడ్డుపై మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. బేస్తవారిపేటకు చెందిన రంగరమేష్, చందన దంపతులు కొమరోలు మండలంలోని రాజుపాలెం వెళ్లి మోటార్‌సైకిల్‌పై స్వగ్రామానికి వస్తున్నారు. పెంచికలపాడుకు చెందిన దొంతా తిప్పయ్య రోడ్డు దాటుతున్న సమయంలో మోటార్‌సైకిల్ ఢీకొట్టింది. అదే సమయంలో దద్దవాడకు చెందిన ట్రాలీ ఆటో కంభం నుంచి గిద్దలూరు వెళ్తోంది. మోటార్‌సైకిల్ ఆటోను ఢీకొట్టడంతో ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఆటోలో ప్రయాణిస్తున్న ఐదుగురిలో కోటా నాగిరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన తిప్పయ్య, నాగిరెడ్డి, రంగరమేష్, చందనను 108లో గిద్దలూరు ప్రభుత్వ, డీజీఆర్ ప్రైవేట్ వైద్యశాలలకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఒంగోలు టౌన్: వినాయక చవితి పురస్కరించుకొని నిమజ్జనం కోసం సామగ్రిని తీసుకొని వస్తూ జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మరణించాడు. పోలీసుల కథనం ప్రకారం .. నాగులుప్పలపాడు మండలంలోని టి. అగ్రహారానికి చెందిన పులగూర తరుణ్ (21), ప్రమోద్ కలిసి వినాయక నిమజ్జనానికి సంబంధించి పూలు, సామగ్రి కొనుక్కునేందుకు మంగళవారం ఉదయం ఒంగోలు వచ్చారు. తిరుగు ప్రయాణంలో గుంటూరు రోడ్డు హైవేలో శ్రీ సూర్య కాలేజీ సమీపంలోకి రాగానే మోటారు బైకు అదుపు తప్పి రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీ కొన్నారు. దాంతో కింద పడిపోయిన తరుణ్ తలకు బలమైన గాయమైంది. అతడిని వైద్య చికిత్స కోసం ఒంగోలు జీజీహెచ్ తీసుకొని వెళ్లగా అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. గాయపడిన ప్రమోద్ చికిత్స పొందుతున్నాడు. తాలుకా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. తరుణ్ తల్లిదండ్రులకు ఒక్కగానొక్క కొడుకు. రాడ్ బెండింగ్ పని చేస్తూ కుటుంబానికి అండగా ఉండేవాడు. చేతికి అందివచ్చిన కుమారుడు అర్ధాంతరంగా మరణించడంతో తల్లిదండ్రులు విషాదంలో మునిగిపోయారు.

కలెక్టర్‌ను కలిసిన గిద్దలూరు కమిషనర్



కలెక్టర్‌కు మొక్క అందజేస్తున్న కమిషనర్

గిద్దలూరు రూరల్: కలెక్టర్ తమీమ్ అన్సారియాను ఒంగోలు ప్రకాశం భవనంలోని ఆమె చాంబర్‌లో గిద్దలూరు నగర పంచాయతీ నూతన కమిషనర్ డి.వెంకటదాస్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నగర పంచాయతీలో ప్రజా సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించినట్లు కమిషనర్ తెలిపారు.

బావమరిదిపై బావ కత్తితో దాడి

ఒంగోలు టౌన్: అక్కను కొట్టనీయకుండా అడ్డుకోబోయిన బావమర్దిపై అతని బావ కత్తితో దాడి చేసిన ఘటన నగరంలో జరిగింది. బాధితుడి కథనం మేరకు.. ఏకలవ్య నగర్‌కు చెందిన శ్రీరాముల పరంత్ ఒక ప్రైవేటు బ్యాంకులో సెంటర్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. అతని సోదరి స్పందనను జగన్నాథం కిశోర్‌కు ఇచ్చి వివాహం చేశారు. పెళ్లైన నాటి నుంచి భార్య స్పందనను మానసికంగా, శారీరకంగా వేధించడం మొదలుపెట్టాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి కన్నవారి ముందే స్పందనను కొడుతుండగా పరంత్ అడ్డుకొని మందలించాడు. దాంతో ఆగ్రహానికి గురైన కిశోర్ పక్కనే ఉన్న కూరగాయలు కోసే కత్తితో బావమరిది వీపు, కంటి కింద పొడవడంతో గాయాలయ్యాయి. భయంతో పరంత్ గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి కాపాడారు. అనంతరం అతన్ని చికిత్స కోసం జీజీహెచ్‌కు తరలించారు. సీఐ వై. నాగరాజు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.